హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా

అత్తాపూర్: బీజేపీ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న హర్ ఘర్ తిరంగా ఘర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని వాడవాడలా నిర్వహించాలని అత్తాపూర్ డివిజన్ అధ్యక్షులు సాబాద విజయ్ కుమార్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడం మల్లారెడ్డి అన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు డివిజన్ అధ్యక్షులు సాబాద విజయ్ కుమార్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడం మల్లారెడ్డి చేతుల మీదుగా త్రివర్ణ పతకాలను ఇంటింటికి పంపిణీ చేసే కార్యక్రమాన్ని హైదర్‌గూడలో ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి దేశభక్తి ఉండేలా ప్రతీ ఇంటిపై జండా రెపరెపలాడేలా ప్రధాని మోడీ ఈ కార్యక్రమాన్ని తలపెట్టారన్నారు. అత్తాపూర్ పోస్టఆఫీస్ వారు త్రివర్ణ పతకాలను అందరికి అందుబాటులో ఉండేలా అధిక మొత్తంలో తెప్పించాలని, ఆగస్టు 15వ తేది వరకు దేశభక్తితో పంపిణీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృష్ణసాయి యాదవ్, నారగూడం సోమనాథ్‌రెడ్డి, కిరణ్, అమృత తదితరులు పాల్గొన్నారు.

జాయింట్ కన్వీనర్‌గా దేవేందర్ రెడ్డి



నియామక పత్రాన్ని అందుకుంటున్న దేవేందర్ రెడ్డి

రాజేంద్రనగర్: రంగారెడ్డి జిల్లా బీజేపీ ఐటీ, సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్‌గా ఏబీవీపీలో పని చేసిన దేవేందర్ రెడ్డిని రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షులు బొక్కా నర్సింహారెడ్డి నియమించారు. తనపై నమ్మకం ఉంచి తనను నియమించిన నరసింహారెడ్డికి దేవేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ బీజేపీ అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆశీస్సులతో రంగారెడ్డి జిల్లా సోషల్ మీడియా ప్రెసిడెంట్ మల్లేష్ యాదవ్ మార్గదర్శకత్వంలో తెలంగాణ బీజేపీ ఐటీ వింగ్‌లో రంగారెడ్డి జిల్లాని ఆదర్శంగా తీసుకునేలా తన పనితీరు ఉంటుందని అన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



రాజేంద్రనగర్: హైదర్‌గూడ చైతన్య విలాస్ కాలనీ శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన సందర్భంగా గురువారం ఉదయం ద్వారపూజ, మహాకుంభ మండల అగ్ని ఆరాధన, విమాన కలశ స్థాపన తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం మహాకుంభ మండల అగ్ని ఆరాధన మూర్తి హోమం, నిత్యం హోమం, గోపూజ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాలను వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా జరిగింది. ఈ వేడుకకు భక్తులు వేలాదిగా హాజరయ్యారు. శుక్రవారం దేవాలయంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

రైల్వేస్టేషన్ రహదారి పనులు ప్రారంభం



రహదారి పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ

శంషాబాద్: పట్టణంలో సిద్ధప రోడ్డు నుంచి రైల్వేస్టేషన్ వరకు ఉన్న రహదారి ఎట్టకేలకు బాగుపడుతోంది. హెచ్‌ఎండీఏ సంబంధించిన రూ. 25 లక్షలతో సీసీ రోడ్డు పనులు గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌తో పాటు స్థానిక కౌన్సిలర్లు అజయ్, శ్రీకాంత్‌లు ప్రారంభించారు. రహదారిని బాగు చేసేందుకు ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో ప్రతి బస్తీలో రహదారులను బాగుచేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో నార్సింగి ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు విరాళాల సేకరణ



నార్సింగిలో విరాళాలు సేకరించిన సీఐటీయు నాయకులు

మణికొండ: కేరళ రాష్ట్రంలోని వయనాడ్‌లో భూ ప్రళయం వచ్చి 400 మందికి పైగా మృతి చెండటంతో వేలాది మంది నిరాశ్రయులయ్యారని, వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సీఐటీయు మండల కన్వీనర్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో నార్సింగిలో ఆటో కార్మికుల నుంచి విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాము సేకరించే విరాళాలను సీఐటీయు రాష్ట్ర కమిటీ ద్వారా కేరళ రాష్ట ప్రభుత్వానికి అందిస్తామన్నారు. గండిపేట మండల పరిధిలోని అన్ని గ్రామాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని ప్రజలు తమకు తోచిన విధంగా సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పురుషోత్తంచారి, అనిల్, సాయి, హరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మణికొండ: ఔటర్ రింగ్ రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా రోడ్డు దాటుతున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం వేగంగా ఢీ కొట్టడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం తెల్లవారు జామున 3.30 గంటలకు జరిగింది. ఇన్‌స్పెక్టర్ హరికృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కోకాపేట ఎస్‌ఏఎస్ బిల్డింగ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి ఔటర్‌రింగ్ రోడ్డు వద్ద రహదారి దాటుతుండగా గుర్తు తెలియని వాహనం అతన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. చనిపోయిన వ్యక్తి బ్లూకలర్ షర్ట్, గ్రే కలర్ పాయింట్ వేసుకుని ఉన్నాడని, కుడిచేతిపై లవ్ సింబల్‌తో పచ్చబొట్టు ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని అతని మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తరఫువారు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్ నెంబర్ 9490617189, 9491039034 లపై సంప్రదించాలన్నారు.

సీజనల్ వ్యాధులతో జర జాగ్రత్త



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు



అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్, వైద్య అధికారులు

మణికొండ: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ, మణికొండ ఉన్నత పాఠశాల, నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని కోకాపేట, నార్సింగి ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు గురువారం చైర్మన్‌లతో పాటు వైద్యాధికారులు సీజనల్ వ్యాధులను ఎదుర్కొనే పద్ధతులపై అవగహన కల్పించారు. ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల రూపంలో మలేరియా, డెంగ్యూ లాంటి వ్యాధులు వస్తాయని, వాటి నుంచి ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని మణికొండ మున్సిపల్ చైర్మన్ నరేందర్ ముదిరాజ్, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్‌లు అన్నారు. బ్లూక్రాస్ సొసైటీ వారు వీధి కుక్కలు కరవకుండా ఎలా కట్టడి చేయాలని, వాటికి చేస్తున్న శస్త్ర చికిత్సలు, వాటి నుంచి తప్పించుకునే మార్గాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్‌లు నరేందర్‌రెడ్డి, విజయ్‌బాబు, కమిషనర్లు ప్రదీప్ కుమార్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మేనేజర్‌లు శ్రీధర్, యోగేష్, కౌన్సిలర్లు శివారెడ్డి, రామకృష్ణారెడ్డి, వైద్యాధికారులు, బ్లూక్రాస్ సొసైటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు. నార్సింగి ఉర్దూ మీడియం పాఠశాలలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వెంకటేశ్‌యాదవ్, నార్సింగిలోని శారదా విద్యానికేతన్‌లో కౌన్సిలర్ ఉషారాణిలు అవగాహన కల్పించారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

బండ్లగూడ: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా హిమాయత్‌సాగర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై ప్రజలకు మున్సిపల్ కమిషనర్ బి.శరత్‌చంద్ర అవగాహన కల్పించారు. ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని శరత్‌చంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మంజులత, టిఎంసీఎస్ శ్రీలత, ఎస్‌ఎల్‌ఎఫ్ ప్రెసిడెంట్ సుహాసిని, వార్డు ఆఫీసర్ శ్రీశైలం, మహిళ సంఘాల సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ శరత్‌చంద్ర

పన్నుల భారం మోపేందుకే గ్రేటర్‌లో విలీనం



మాట్లాడుతున్న పీఏసీఎస్ డైరెక్టర్ కరుణాకర్‌రెడ్డి

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ ఏర్పాటు తర్వాత ఐదేళ్ల కిందట గ్రామాలుగా ఉన్న ప్రజలకు పన్నుల భారం తప్ప ఎలాంటి ప్రయోజనం జరగలేదని శంషాబాద్ పీఏసీఎస్ డైరెక్టర్ రంగారెడ్డి కరుణాకర్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానికంగా యువకులు, రైతులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీతో పాటు సమీప గ్రామాలను కూడా గ్రేటర్‌లో విలీనం చేయాలన్న ప్రభుత్వ ప్రతిపాదన వెంటనే విరమించుకోవాలన్నారు. నేటికి వందలాది మంది సాగుచేసుకుంటున్న ఈ ప్రాంతాన్ని గ్రేటర్‌లో విలీనం చేయడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొవాల్సి ఉంటుందన్నారు. జీవో 111 ఉన్న కారణంగా ప్రస్తుతం గృహనిర్మాణాలకు అనుమతి లేని శంషాబాద్‌లో భవిష్యత్తులో మరింత ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. దీనిపై పార్టీలకతీకతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు శంషాబాద్ మున్సిపాలిటీతో పాటు సమీప గ్రామాలను గ్రేటర్‌లో విలీనం చేయకుండా అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన యూత్ నాయకులు గాజుల రాహుల్, కుందేళ్ల ప్రసాద్, రాము, దామోదర్‌రెడ్డి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఏటీఎంలో చోరీకి ప్రయత్నం



మైలార్‌దేవ్‌పల్లి: యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలోకి ఓ వ్యక్తి చొరబడి చోరీకి ప్రయత్నించగా అలారం మోగడంతో పారిపోయాడు. సీఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. డివిజన్ పరిధిలోని కాటేదాన్ చౌరస్తాలోని యాక్సిస్ బ్యాంక్ ఏటీఎంలో బుధవారం రాత్రి దొంగ దూరి ఏటీఎం డోర్ విరగొట్టడానికి ప్రయత్నం చేశాడు. సరిగ్గా ఆ సమయంలో అలారం మోగడంతో పారిపోయాడు. స్థానికులు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజ్ ఆధారంగా దొంగను పట్టుకొని విచారించారు. తాగిన మత్తులో ఏటీఎంలోకి వెళ్లనని తెలుపడంతో తాగుబోతుని మందలించి వదిలేశారు.

భూ కబ్జాకు యత్నం

మణికొండ: మణికొండ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 226లో ఉన్న భూమిని గతంలో యజమానులు జనచైతన్య వారికి అమ్మడంతో వారు లేఅవుట్ చేశారు. చిత్రపురి నుంచి ల్యాంకోహిల్స్ మార్గంలో రోడ్డు వెడల్పు చేయటంతో అక్కడ ఒక ప్లాట్ భూమి కొంత నష్టపోగా మరికొంత మిగిలి ఉంది. అది సర్వే నెంబర్ 239లోకి వస్తుంది. అలాంటి భూమిపై కన్నేసిన కొందరు 226లోని భూమి తాము కొనుగోలు చేశామని, దానికి ప్రహరీ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. దీంతో స్థానికులు మున్సిపల్ వైస్ చైర్మన్ నరేందర్‌రెడ్డికి విషయం చెప్పడంతో చైర్మన్ కబ్జాదారులను అడ్డుకున్నారు. సరైన పత్రాలు చూసుకుని భూములు కొనుగోలు చేయాలని, ఎక్కడ పడితే అక్కడ కొనుగోలు చేసి ఇతరులను ఇబ్బందులకు గురిచేస్తే కేసు నమోదు చేయాల్సి వస్తుందని చైర్మన్ హెచ్చరించడంతో కబ్జాదారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.



ప్లాట్‌లో ప్రహరీ నిర్మించేందుకు వచ్చిన వ్యక్తులు

వృద్ధురాలి అదృశ్యం



నాగలక్ష్మమ్మ

మైలార్‌దేవ్‌పల్లి: ఇంటి నుంచి పనికి వెళ్లిన వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగలక్ష్మి (70), సుధాకర్‌రెడ్డి దంపతులు తన ఇద్దరు కొడుకులతో ఆరేళ్ల క్రితం గద్వాల నుంచి తమ కుటుంబంతో బతుకుదెరువు కోసం కాటేదాన్‌లోని బుద్వేల్ వేంకటేశ్వర కాలనీకి వచ్చారు. 3 ఏళ్ల నుంచి ఇరువురు వేరుగా ఉంటూ కాటేదాం పరిశ్రమలలో పని చేసుకుంటున్నారు. ప్రతి రోజులాగే నాగలక్ష్మి సోమవారం ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి పనికి బయలుదేరింది. రాత్రి అయినప్పటికీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులను విచారించినా ఫలితం లేకపోవడంతో కొడుకు బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శుభాకాంక్షల వెల్లువ



మణికొండ: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రాజేంద్రనగర్, నార్సింగి ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్ బి. జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ జి. విజయ్‌బాబు, నాయకులు శ్రీనివాస్, గోపాల గణేష్, కౌన్సిలర్‌లు దుర్గేష్‌యాదవ్, నరేష్‌లతో పాటు పెద్ద ఎత్తున నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది

రాయదుర్గం: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎంతో గౌరవం ఉందని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా అన్నారు. గురువారం గచ్చిబౌలి డివిజన్ ఖాజాగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో సాయిబాబా మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు నిరంతరం కృషి చేయాలన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకరావాలన్నారు. పాఠశాల అభివృద్ధికి అండగా ఉంటానన్నారు. అంతకుముందు విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్యామల, ఏఏపీసీ చైర్మన్ వీణ, ఇన్‌చార్జీ హెచ్‌ఎం గాలినరహరి, బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయులు మమత, సుజాత, బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులు సరిత, భాగ్యమ్మ, కొండయ్య, శంకరాచారి, జయశ్రీ, సైయింట్ ప్రతినిధులు కృష్ణ,విద్యార్థులు,స్థానికులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



గోల్కొండ: దోమల నివారణకు బల్దియా మలేరియా విభాగం వారు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి ఎమ్మెల్యే కౌసర్‌మొహియుద్దీన్ అన్నారు. గురువారం ఆయన నానల్‌నగర్ డివిజన్ హకీంపేట్‌లో బుల్కాపూర్ నాలాలో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేవలం ఆయిల్ బాల్స్ వదిలేసి మలేరియా అధికారులు చేతులు దులుపుకోవద్దు అని అన్నారు. నాలాలు, చెరువులలో పూడికలు తీస్తూ వాటిని శుభ్రంగా ఉంచితే దోమలు వృద్ధి చెందవన్నారు. అయితే మలేరియా అధికారులు మాత్రం చిత్తశుద్ధితో పని చేయడం లేదని అన్నారు. వారి నిర్లక్ష్యం కారణంగా దోమలు వృద్ధి చెంది విష జ్వరాలను వ్యాప్తి చెందుతున్నాయని అన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

రాయదుర్గం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం మనందరి బాధ్యత అని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన నాలాల వ్యర్థాల తొలగింపు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా చేయడం కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే భావించవద్దని ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకుంటేనే పచ్చదనం, స్వచ్ఛదనం కల సాకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమాన్ని నిత్య ప్రక్రియగా నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. కాలనీవాసులు, అసోసియేషన్ సభ్యులు, సామాజికవేత్తల సమష్టి కృషితోనే బస్తీలు, కాలనీలను ఆదర్శవంతంగా, సుందరంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ సంజయ్, ఇంజనీర్ సోమ్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

వన మహోత్సవం



స్వచ్ఛదనం-పచ్చదనంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శశాంక

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పిఅండ్‌టి కాలనీ వై జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమంలో గురువారం జిల్లా కలెక్టర్ కె.శశాంక పాల్గొని మొక్కలు నాటారు. కాళీమందిర్ నుంచి హిమాయత్‌సాగర్ వెళ్లే రోడ్డులో ఉన్న నీటి గుంతలలో నిల్వ ఉన్న నీటిలో ఆయిల్ బాల్స్ (దోమల నివారణకు) వేశారు. దోమ లార్వా నివారణకు టిమిఫాస్ స్ప్రే చేయడాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి మున్సిపాలిటీ పరిధిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా, దోమల పెరగకుండా, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు లేకుండా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని, మొక్కలు పెంచడంలో ముందుండేలా స్వచ్ఛదనం-పచ్చదనంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల లతాప్రేమ్‌గౌడ్, కమిషనర్ బి.శరత్‌చంద్ర, 7వ డివిజన్ కార్పొరేటర్ పద్మావతిపాపయ్య, డిఈఈ యాదయ్య, ఏఈఈ రాజ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, సీనియర్, సిబ్బంది పాల్గొన్నారు.



అడ్వొకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలి



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాజేంద్రనగర్: న్యాయవాదులు అమృత రావు, కవిత దంపతులపై జనగామ పోలీసులు చేసిన దాడిని ఖండిస్తూ రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించి గురువారం ఉప్పర్‌పల్లి రాజేంద్రనగర్ కోర్టు ఆవరణలో నిరసనలు చేపట్టారు. ఈ మేరకు కోర్టు న్యాయవాదులు రెండు రోజులు విధుల బహిష్కరణకు పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు శీలం తిరుపతి రెడ్డి మాట్లాడుతూ... ఓ కేసు విషయంలో మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన ఇద్దరు న్యాయవాదులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించి దాడి చేశారని ఆరోపించారు. న్యాయవాదులపై దాడి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. దాడి చేసి రెండు రోజులు గడుస్తున్నప్పటికీ ఇంతవరకు జనగామ డీసీపీ, ఏసీపీ ఎలాంటి కేసు నమోదు చేయలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడులు న్యాయవాదుల హక్కులను కాలరాయడమేనని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అమలు చేయాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ కార్యదర్శి టి.ఎల్.శ్రీధర్ రెడ్డి, నాయక్, ప్రతాప్, కృష్ణ, సుధాకర్ రెడ్డి, పూర్ణచందర్ రెడ్డి, ప్రతాప్, ఖలీల్, పాషా, హరిప్రసాద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేయండి

మణికొండ: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను రాజేంద్రనగర్ ఎమ్మెల్యేతో పాటు రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్ జ్ఞానేశ్వర్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ముంగి జైపాల్‌రెడ్డిల వర్గాలతో గురువారం ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. పార్టీని నమ్ముకుని ఉన్న వారికి ఎక్కడా అన్యాయం చేయకుండా వారికి రాబోయే స్థానిక ఎన్నికలతో పాటు నామినేటెడ్ పోస్టులలోను అవకాశం కల్పించాలన్నారు. అదే పద్ధతిలో కొత్తగా పార్టీలో చేరిన వారికి వారి స్థాయిని బట్టి అవకాశాలు కల్పిస్తామన్నారు. పాత, కొత్త నాయకులు కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని కాంగ్రెస్‌కు కంచుకోటగా తీర్చుకోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లోను కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, నియోజకవర్గంలో జరిగే అధికారిక కార్యక్రమాల్లో పాత, కొత్త నాయకులనే తేడా లేకుండా అన్ని వర్గాలవారు కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్సింగి మున్సిపాలిటీ వైస్ చైర్మన్ విజయ్‌బాబు, చైర్‌పర్సన్ భర్త శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మాజీ చైర్‌పర్సన్ రేఖయాదగిరి, మాజీ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఇంటివద్ద సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న సామాజికవేత్త నరేందర్‌బాబు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేటర్ సాగర్‌గౌడ్ జన్మదినం సందర్భంగా తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 37వ సారి నరేందర్‌బాబు రక్తదానం చేయడంతో సాగర్‌గౌడ్‌ను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా సాగర్‌గౌడ్ మాట్లాడుతూ.. అన్నిదానాల్లో రక్తదానం ఎంతో గొప్పదని, ఆరోగ్యరీత్యా అర్హత ఉన్నవారు దయచేసి రక్తదానం చేయాలని విజ్ఞప్తి చేశారు. తలసేమియా అనేది జన్యుపరమైన రుగ్మత, ఇది హిమోగ్లోబిన్ ఉత్పత్తిని ప్రభావితం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నదీమ్, వెంకటేష్ తదతరులు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణకు చర్యలు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ పరిధిలో రహదారుల విస్తరణకు చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం గచ్చిబౌలి, బయోడైవర్సిటీ, బొటానికల్ గార్డెన్, నానక్‌రాంగూడ జంక్షన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీ కారిడార్‌లో వాహనదారులు నిత్యం ట్రాఫిక్ సమస్యలతో సతమతమవుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్ల విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు. బాటిల్ నెక్ రోడ్లను గుర్తించి విస్తరణ చేపట్టేలా ప్రణాళిక రూపొందించాలని టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా ఉన్న గచ్చిబౌలి జంక్షన్‌ను అందగా తీర్చిదిద్దాలని, సెంట్రల్ మీడియంలో గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. అంజయ్యనగర్ వద్ద ప్రధాన రహదారి సమీపంలోని బండరాయిని తొలగించి రహదారిని విస్తరించాలన్నారు. బొటానికల్ గార్డెన్ వద్ద ఫ్రీ లెఫ్ట్‌ను ఏర్పాటు చేసి కొండాపూర్ వైపు ట్రాఫిక్ సజావుగా నడిచేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. కూడళ్ల అభివృద్ధి, స్ట్రీట్ ఫర్నీచర్, వాల్ పెయింటింగ్‌లను విస్తరించే ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు జడ్సీ పేర్కొన్నారు. కార్యక్రమంలో జోనల్ ఎస్ఈ శంకర్, డీసీ రజినీకాంత్ రెడ్డి, టౌన్ ప్లానింగ్ అధికారులు గణపతి,మెహ్రా, డాక్టర్ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

